ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 12 | ఆగష్టు 2013

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
08814 - 224747
9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ......... 01-07-2013



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-07-2013, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం కృష్ణాష్టమి, శ్రీరామనవమి ఎలా చేసుకుంటున్నామో అలాగే వ్యాసుడి జన్మదినోత్సవాన్ని గురుపౌర్ణమిగా జరుపుకొంటున్నాము. ఎవరి సాంప్రదాయంలో ఉన్న గురువులను వారు గౌరవించుకోవటానికి గురుపౌర్ణమిని మన పెద్దలు ఏర్పాటు చేసారు. వాల్మీకిమహర్షి, వ్యాస మహర్షి వీరిద్దరు మన భారతీయ సంస్కృతికి మూలపురుషులు. వాల్మీకి, వ్యాసుడు ఇద్దరూ మహాపండితులు. మన భారతీయ సాహిత్యం అంతా వారే క్రియేట్ చేసారు. పూర్వం మన సాహిత్యం అంతా కూడా మంత్రరూపంలో ఉండేది. మొట్టమొదట సంస్కృత శ్లోకాన్ని రాసింది వాల్మీకే అందుచేత వాల్మీకిని ఆదికవి అంటారు. వ్యాసుడు భారతం వ్రాసాడు, భాగవతం వ్రాసాడు, పురాణాలు వ్రాసాడు. బ్రహ్మసూత్రాలు వ్రాసాడు. భగవద్గీతను పరమాత్మ చెప్పాడు కాని దానిని శ్లోకబద్ధం చేసింది వ్యాసుడే. వ్యాసో విశాలబుద్ధి. వ్యాసుడికి ఉన్నంత విశాలబుద్ధి ప్రపంచంలో ఎవరికీ ఉండదేమో అనిపిస్తుంది. ప్రపంచంలో ఉన్న అన్ని మతాలకీ, అన్ని మార్గాలకు, అన్ని తత్వాలకు వ్యాసుడి హృదయంలో స్థానం ఉంది. ఆయనది అంత విశాలమైన హృదయం. అంత విశాలమైన బుద్ధి.

ఈ మధ్య ఒక ఇంజనీరుగారు నన్ను పరామర్శించటానికి మా ఇంటికి వచ్చారు. తరువాత పది రోజులకు ఆయన స్వర్గస్థులయ్యారు. ఆయన నాతో ఏమన్నారు అంటే వాల్మీకి చాలా దోపిడీలు చేసాడు, చాలా మందిని చంపాడు. వాల్మీకి ఏమి చదువుకొన్నాడని రామాయణం

వ్రాసాడు. ఎవరో వ్రాసి వాల్మీకి పేరు పెట్టారు అన్నారు. ఎవరో వ్రాస్తే వారి పేరే పెట్టుకుంటారు కాని వాల్మీకి పేరు ఎందుకు పెడతారు అని చెప్పి నేను ఊరుకున్నాను. ఎందుచేతనంటే నన్ను పరామర్శ చేయటానికి వచ్చినప్పడు ఆయనతో ఏమీ వాదనకు దిగకూడదు. ఆయన మనిషి చాలామంచివారే కాని ఆయన భౌతికవాది. ప్రతీ విషయాన్ని భౌతికదృక్పథంతో చూస్తారు. కొద్దిగా ఉద్రేకంగా ఉంటారు. వాల్మీకి ఏమీ చదువుకోలేదు కదా రామాయణం ఎలా వ్రాసాడు అంటే వాల్మీకి గొప్ప తపస్సు చేసాడు. తపస్సు వలన కూడా విద్య వస్తుంది. ఆ విషయం ఇంజనీరు గారికి తెలియదు. రమణమహర్షిగారు తెలుగులో, తమిళంలో, సంస్కృతంలో కవిత్వం చెప్పారు. ఆయన పదవ తరగతి చదువుకొన్నారు. మరి ఆ కవిత్వం ఎక్కడ నుండి వచ్చింది. రామకృష్ణ పరమహంస గారికి చదువు ఏముంది? మరి ఆయన ప్రపంచానికి గురువు అయ్యారు కదా! జగద్గురువు అయ్యారు కదా! జ్ఞానం అనేది లోపలనుండి ఊరుతుంది. కాని బయట నుండి వచ్చేది కాదు. పుస్తకాలు చదవటం వేరు, తపస్సు అనేది వేరు. యిప్పడు వచ్చిన ప్రమాదం ఏమిటి అంటే ఈమధ్య ప్రవచనాలు చేసేవారికి, రచయితలకు చాలామందికి పుస్తకజన్యజ్ఞానమే కాని తపస్సు లేదు. అందుచేత ఆవాక్యాలలో ఉన్న లోతుకాని, అందులో ఉన్న విశాలత్వం కాని, భగవంతుడు చెప్పినమాటల యొక్క అర్థం కాని ఆ బరువుకాని వారికి తెలియటం లేదు.

కోరిక, కోపం, లోభిత్వం, గర్వం, అసూయ యివన్నీ క్రూరమృగాల వంటివి. మనం అడవిలో తిరుగుతూ ఉంటే ఏజంతువు వచ్చి సడన్‌గా మీద పడుతుందో చెప్పలేము. యిప్పడు మనందరం యిక్కడ శాంతిగా ఉన్నాము. యింకో గంటలో మనకు కోపం వచ్చేయవచ్చు. యిప్పడు మనకు ఎవరిమీద ద్వేషం లేదు అనుకోండి, తరువాత ద్వేషం రావచ్చు. ఏ క్రూర మృగం ఎప్పడు వచ్చి మనశిరస్సు మీద పడుతుందో చెప్పలేము. అందుచేత మనం బహు జాగ్రత్తగా ఉండాలి. వాటిలో నుండి శేషం లేకుండా విడుదల అవ్వటానికి ప్రయత్నం చెయ్యాలి.

పరమహంస గారు భగవద్గీత గురించి మాట్లాడుతూ ఏమన్నారు అంటే ఎవరికయినా సరే అందులో విమర్శించే విషయం ఒక్కటీ లేదు. ఎందుచేతనంటే అది భగవంతుడు చెప్పాడు. భగవద్గీతను మీరు ఎవరయినా విమర్శిస్తూ ఉంటే ఆ శ్లోకం మీకు అర్థమవ్వటం లేదు కాబట్టి విమర్శిస్తున్నారు, మీకు ప్రొపర్ అండర్‌స్టాండింగ్ లేకపోవటం వలన విమర్శించటం గాని భగవంతుడే స్వయంగా చెప్పినప్పడు అందులో విమర్శించటానికి ఏమీ అవకాశం లేదు.

ఉన్న విషయం ఉన్నట్లుగా అర్థం చేసుకోవటానికి కూడా భగవంతుడు మనకు శక్తిని ఇవ్వాలి. సబ్జెక్టును ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలంటే మనకు నిదానమైన బుద్ధి ఉండాలి, సరళమైన బుద్ధి ఉండాలి, ఏకాగ్రమైన బుద్ధి ఉండాలి, సహజమైన బుద్ధి ఉండాలి. మనకు నేను అనే తలంపు ఉంది. ఈ నేను దేహానికి సంబంధించింది అనుకొంటున్నాము, ఒకోసారి మనస్సుకు సంబంధించింది అనుకొంటున్నాము. ఈ దేహానికి, మనస్సుకు సంబంధంలేని, జనన మరణము తోటి సంబంధం లేని నేను ఒకటి మీ హృదయంలో ఉంది, ఆ నేనును గాఢనిద్రలో నువ్వు అనుభవిస్తున్నావు. ఆత్మ ఎంత పవిత్రమైనదో నీ మనస్సు అంత పవిత్రం అయితే, నీ బుద్ధి అంత పవిత్రం అయితే హృదయంలో ఉన్న నేను నీకు ఎరుకలోనికి వస్తుంది. మనం ఏ రోజుకారోజు పాత్రలను తోమి ఎలా శుభ్రం చేసుకొంటామో అలాగ ఏరోజుకారోజు జపధ్యానములు చేసి, సజ్జనసాంగత్యం చేసి మీ మనస్సును, బుద్ధిని శుద్ధి చేసుకోవాలి. శుద్ధ మనస్సులోనే, శుద్ధబుద్ధిలోనే లోపల ఉన్న నేను ప్రతిబింబిస్తుంది. పాత్రలను రోజూ తోమాలి అంటున్నారు మరి ఆ పాత్ర బంగారంతో చేసింది అయితే దానిని తోమాలా అని అడుగుతున్నారు. అదే బ్రహ్మం. అది రోజూ మీరు కడిగేది కాదు. ఒకసారి మీకు అనుభవం కలిగినా అది పెర్మనెంట్ అయ్యేవరకూ ఏదయినా వాసనలు అటుఇటు ఆడిస్తాయి. పూర్తిగా వాసనలు నాశనమయితే అప్పుడు మీకు బ్రహ్మానుభవం స్థిరపడుతుంది. దానినే సహజసమాధి అంటారు. అప్పుడు రావటం, పోవటం అనేది ఉండదు.

**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాన్తిమృచ్ఛతి (5-29)**

భోక్తారం యజ్ఞతపసాం అంటే ఈ జీవకోటి చేసే తపస్సులకు, యజ్ఞాలకు, యాగాలకు నేనే కర్తను, నేనే భోక్తను. వీటి అన్నింటికి నేనే భోక్తను అంటే వాటి ఫలితాన్ని అనుభవించే వాడిని నేనే అని చెపుతున్నాడు. మీరు కష్టపడి చేస్తూ ఉంటే ఆయన అనుభవించేయటం ఏమిటి? మీకు ఏమీ ఇవ్వడా? మీకు సంకల్పాన్ని కలిగించేవాడు దాని ఫలితాన్ని అనుభవించే వాడు ఆయనే అని శంకరుడు, రామానుజుడు చెప్పారు. మధ్వాచార్యుడు ఏమని చెప్పాడు అంటే చెంబులో ఒక శేరు పాలు పడతాయి అనుకో అందులో మీరు నాలుగుశేర్లు పొయ్యగలరా అంటే పొయ్యలేరు. బుడగలో గాలి ఊదేకొలది అది ఏమౌతుంది. చివరకు పేలిపోతుంది. ఆ ఫలితాన్ని నువ్వు ఎంతవరకు భరించగలవు అనేది భగవంతుడు చూస్తాడు. నువ్వు ఏదైనా మంచికర్మ చేసినా, గొప్ప పనులు చేసినా దానికి ఎంత ఫలితాన్ని ఇస్తే మీరు

భరించగలరో అంత ఇచ్చి మిగతాది స్టోర్‌లో ఉంచి, మరల మీకు ఎప్పుడు అవసరమో చూసి, ఆ ఫలితాన్ని క్వయిట్‌గా, కూల్‌గా భరించగలరు అనుకొన్నప్పుడు మీది మీకే ఇచ్చేస్తాడు. ఆ ఫలితాన్ని ఆయన ఏమీ తినేయడు. మీ యోగ్యతనుబట్టి ఇస్తాడు. మిగతాది స్టోర్‌లో ఉంచి ఏ జన్మలో అది ఇవ్వాలో, ఎప్పుడు నువ్వు దానికి డిజర్వు అవుతావో చూసి అప్పుడు ఇస్తాడు. మనకు ఎంత యోగ్యత ఉందో, ఎంత అర్హత ఉందో అంతే వస్తుంది కాని అంతకంటే అదనంగా రాదు.

సిరీస్ సుబ్బరాజుగారు ఒక సంఘటన చెప్పారు. ఆయన అమెరికాలో యంఎస్ చదువుకొనివచ్చి, బొంబాయిలో ట్రైనింగ్ అయిన తరువాత నేను వ్యాపారం పెట్టుకొంటాను అని తండ్రిగారితో చెప్పారట. నువ్వు అమెరికాలో చదువుకొన్నావు, ఉద్యోగం చేసుకో, మంచి జీతం ఇస్తారు, రాజులు వ్యాపారం బాగా చేయలేరు అని తండ్రిగారు చెప్పారు. నువ్వు వ్యాపారం చేసి ఆస్తులు పాడుచేస్తే కష్టం కదా అని సుబ్బరాజుగారి అన్నగారు అన్నారు. చివరకు తండ్రిగారు ఏమన్నారు అంటే వీడు వ్యాపారం చెయ్యటం ఎలాగూ మానడు అందుచేత ఆస్థిని మూడు వాటాలు వేసుకొందాము. వాడి వాటా తీసుకొని వెళ్ళి వ్యాపారం చేసుకొంటాడు. నేను కూడా ఒక వాటా తీసుకొంటాను అని తండ్రిగారు అన్నదమ్ములిద్దరకు చెప్పారు. తరువాత ఎవరో బంధువులు మీకు వాటా ఎందుకు అని తండ్రిగారిని అడిగారట. సరిగ్గా ఇక్కడ మద్వాచార్యులవారు చెప్పింది సరిపోతుంది. తండ్రిగారు ఏమన్నారు అంటే నాకు పెద్ద వయస్సు వచ్చేసింది, నేను తినేది ఏమీ లేదు. వాడు వ్యాపారంలో పాడు చేస్తాడు అనుకోండి, వాడికి సపోర్టుకోసం నావాటా వాడికి ఇస్తాను అందుచేత వాటా తీసుకొన్నాను, నేను తినేద్దామని కాదు అని చెప్పారట. ఇక్కడ భగవంతుడు చెప్పేది అదే. నీవు ఎంతవరకు భరించగలవో అంత ఇచ్చి మిగతాది జాగ్రత్తపెట్టి నీకు అవసరమైనప్పుడు ఆ ఫలితాన్ని ఇస్తాను అంటున్నాడు, అందులో ఆయన స్వార్థం ఏమీలేదు. తండ్రి ఉండగానే సుబ్బరాజుగారు వ్యాపారంలో పైకి వచ్చారు. ఇంక వ్యాపారంలో ఆయన పాడుచేయడు అని నిర్ధారణకు వచ్చాక తండ్రిగారు ఆయన వాటాను కొడుకులు ఇద్దరకు రాసి ఇచ్చేసారు. ఇక్కడ సుబ్బరాజుగారి తండ్రికే స్వార్థం లేనప్పుడు ఇంక భగవంతుడికి స్వార్థం ఏమిటి? మీరు ఎంత గొప్ప సత్కర్మ చేసినా ఒకోసారి తక్కువ ఫలితం ఇస్తాడు. అంటే మిగతాది ఆయన తినేస్తాడు అనికాదు. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఆయన చూసుకొంటాడు.

సర్వలోక మహేశ్వరమ్ అంటే సమస్తలోకములకు ఈశ్వరుడిని అంటే అన్ని లోకాలకు నేనే ప్రభువుని. ఈశ్వరుడు అంటే పరిపాలించేవాడు అని అర్థం. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి వారి ప్రారబ్ధానుసారం ఆ జీవులను ఆడిస్తున్నాను. ఏది ఎప్పుడు ఎక్కడ జరగాలో అలా జరిగేటట్లు ఏర్పాటుచేస్తాడు. ఈ శరీరం ఎప్పుడు భూమిమీదకు వచ్చిందో అప్పుడే చనిపోయేరోజు కూడా నిర్ణయం అయిపోతుంది, ఇవన్నీ నిర్ణయించేవాడు ఈశ్వరుడు. సుహృద సర్వభూతానాం ఎదుటి జీవుడి దగ్గరనుండి ఏమీ ఆశించకుండా సహజంగా వాడి క్షేమాన్ని కోరుకొంటాడు, సహజంగా వారిని ప్రేమిస్తాడు. ఆ ప్రేమ కామరహితం అంటే అందులో కోరికలు ఏమీ ఉండవు. ఎవరైనా మిమ్మల్ని ప్రేమిస్తున్నారు అనుకోండి అది నిష్కామంగా ప్రేమిస్తున్నారా లేక కోరికతో మిమ్మల్ని ప్రేమిస్తున్నారా? ఒకవేళ కోరికతో మిమ్మల్ని ప్రేమిస్తూ ఉంటే అది వ్యాపారమే. వాడు ఏ కులస్థుడు అయినా, ఏ మతస్థుడు అయినా ఇంతవరకు ప్రపంచంలో స్వార్థపరుడు ఎవడికీ ఆత్మానుభవం రాలేదు. స్వార్థం ఎక్కడ ఉంటుంది? ఇంద్రియాలలో ఉంటుంది, మనస్సులో ఉంటుంది. నువ్వు వాటిని ప్రక్కకు తప్పించలేవు కదా. ఇంక స్వార్థంలోనుండి ఎలా బయటకు వస్తావు. వాటిని ప్రక్కకు తప్పించకుండా నువ్వు విశాలం ఎలా అవుతావు.

ఏమీ ఆశించకుండా జీవకోటిని ప్రేమించేవాడు భగవంతుడు. ప్రతిఫలం ఆశించకుండా ఎదుటి మనిషిని హృదయపూర్వకంగా, అందులో ఏమీ వ్యాపారం లేకుండా ఎవడయితే ప్రేమిస్తున్నాడో వాడు భగవంతుడితో సమానము అంటే వాడు భగవంతుడి యొక్క స్వరూపాన్ని పొందుతాడు. అలా ప్రేమించేవారిని మనం మహాత్ములు, మహర్షులు, యోగులు అంటాము. భగవంతుడు సమస్త ప్రాణులకు ఆత్మీయుడే, ఆయన దయా స్వరూపుడు, సమస్తలోకాలకు ప్రభువు, జీవకోటి అందరి క్షేమం కోరేవాడు. నిన్ను ఎప్పుడయినా భగవంతుడు బాధపెట్టినట్లు నీకు అనిపించవచ్చు. మనల్ని ఇలా హింస పెడుతున్నాడు ఏమిటి అని మీరు అనుకొంటారు. దానికీ కారణం ఉంటుంది. మీ మనస్సులో ఏదయినా విషం ఉంటే దానిని కక్కించటానికే అలా చేస్తాడు. మీకు ఎక్కడయితే యిష్టం ఉందో వారిచేత మిమ్మల్ని తిట్టిస్తూ ఉంటాడు. వారిమీద ఉన్న రాగం పోవటానికే అలా చేస్తాడు. మనిషి కలుషితం అవ్వటానికి రాగద్వేషాలే కారణం. నీకు ఎక్కడా యిష్టంలేదు అనుకో, ఎక్కడా అయిష్టం లేదు అనుకో, నీ మనస్సు ఆ రోజుకారోజు పవిత్రం అయిపోతుంది. నీకు యిష్టాలు

అయిష్టాలు లేకపోతే అసలు మనస్సు బాహ్యముఖానికి రాదు. రాగము, భయము, క్రోధము, ద్వేషము ఇవి మనిషికి చాలా అపకారం చేస్తాయి, ఇవి మనిషియొక్క ఆధ్యాత్మికఅభివృద్ధిని ఆపుచేసే శత్రువులు.

**లభన్తే బ్రహ్మ నిర్వాణం ఋషయః క్షీణకల్మషాః**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితేరతాః**

క్షీణకల్మషాః అంటే మీ మనస్సులో ఉన్న దోషాలు, పాపాలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మనస్సును శుభ్రం చేయాలి. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. మనస్సులోనికి వచ్చే ప్రతీ తలంపు ప్రభావం శరీరం మీద ఉంటుంది. మనస్సులో ఆ దోషం ఉంది, ఈ దోషం ఉంది అని అనుకోవద్దు. నీకు కాలులో ముల్లు గుచ్చుకుంది. అది ఎప్పుడు గుచ్చుకుంది అనేది అనవసరం, ఉన్న ముల్లును తీయించుకో., అలాగే నీ మనస్సులో దోషాలు ఉన్నాయి అనుకో, అవి ఎలా వచ్చాయి అనే గొడవ వద్దు , దోషాలు ఉన్నాయి కాబట్టి వాటిని తొలగించుకో. ఛిన్నద్వైదా - దేరీజ్ ఈశ్వర, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆ విషయంలో ఏరకమైన సందేహాలు పెట్టుకోవద్దు. ఒకోసారి అనుకునేది ఒకటి ఉంటుంది, జరిగేది వేరొకటి అవుతుంది. భగవాన్ పవళకుండ్రులో ఉన్నప్పుడు ఆయనను ఇంటికి తీసుకొని పోవటానికి తల్లి, అన్నగారు వచ్చారు. నువ్వు యోగిలాగ కనిపిస్తున్నావు. నీలాంటి వాడికి ఇంటికాడ పని ఏముంది? ఎక్కడికయినా పోరాదా అని నేను అన్నాను. నువ్వు బాగా చదువుతావు అనే ఉద్దేశంతో అన్నాను కాని బయటకు పొమ్మని కాదు, నేను చెప్పిన మాట నీకు అర్ధమవ్వలేదు అన్నాడు అన్నగారు. వీడు అన్నమాటకు భగవాన్ పారిపోయాడు అని అన్నగారు అనుకొంటున్నాడు. ఆ మాటకు భగవాన్‌కు కోపం రాలేదు, అన్నగారు చెప్పింది నిజం అనుకొన్నాడు. అన్నగారు ఎవడు అనటానికి, అరుణాచలేశ్వరుడే అనిపించాడు, అది అరుణాచలేశ్వరుడి పిలుపు, అది ఈశ్వరనిర్ణయం.

యతాత్మనః ఇక్కడ ఆత్మ అంటే మనస్సు, జీవుడు. నీ మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. భగవంతుడు ఏది ఎందుకు చేస్తున్నాడో మీకు తెలియదు. ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని శాస్త్రాలు శ్రవణం చేసినా మనోనిగ్రహం చాలా ముఖ్యమైనది. నువ్వు బ్రాహ్మిస్థితి పొందిన తరువాత ఇంతకుముందు నువ్వు చేసిన మంచిపనులు, నువ్వు విన్న మంచి విషయాలు, నువ్వు చదివిన చదువులు, ఇంతవరకు నువ్వు గడిపిన జీవితం వీటికి ఏమీ

విలువలేదని, ఇంక వాటిని రిపీట్ చేయనక్కరలేదు అని నీకు తెలుస్తూ ఉంటుంది. అట్టిదివయ్యా బ్రాహ్మీస్థితి. ఎవరయినా వచ్చి నువ్వు చాలా మంచిపని చేసావు అంటే అసలు నీకు ఏమీ అనిపించదు. బ్రాహ్మీస్థితి పొందిన వారి ఆనందంతో పోల్చి చెప్పటానికి ఈ సృష్టిలో యింకో ఆనందంలేదు.

సర్వభూతహితేరతాః సర్వప్రాణుల క్షేమంకోరండి. సమస్త ప్రాణకోటి పట్ల కరుణ కలిగి ఉండండి. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని అనుకోవద్దు, అందరి క్షేమం కోరండి. సర్వభూతహితేరతాః ఇది శ్లోకంలో ఒక భాగం కాని ఇది నాకు శ్లోకం అనిపించటంలేదు, మంత్రం అనిపిస్తోంది. రామమంత్రం ఎలాగో, కృష్ణమంత్రం ఎలాగో సర్వభూతహితేరతాః ఇది కూడా మంత్రమే. యిది అస్తమాను జ్ఞాపకం వస్తూఉంటే మన మనస్సులో ఉన్న దోషాలు చాలా మటుకు పోతాయి. ఒక మనిషి చెడ్డవాడు అయితే వాడికి దూరంగా ఉండు అంతే కాని వాడి క్షేమం కోరటంలో మటుకు దారిద్ర్యం వద్దు. భావదారిద్ర్యం ఉండకూడదు. మనం అందరికి ఉపకారాలు చేయలేకపోవచ్చు. మనస్సులో దారిద్ర్యం ఉండకూడదు. మనం అందరి క్షేమం కోరుతూ ఉండాలి. అందులో దారిద్ర్యం పనికిరాదు. ఒక మనిషిఎంత చెడ్డవాడు అయినా వాడిని ద్వేషించకండి అంటే వాడితో స్నేహం చేయమనికాదు. వాడిని ద్వేషిస్తూ ఉంటే మీ మనస్సు భగవంతుడి మీద నిలబడకుండా వాడి మీదకుపోతుంది. అదిమనకే ప్రమాదం. అందరి క్షేమం కోరేవాడికి, సంశయరహితుడికి, మనస్సులో ఒక్క కల్మషం లేనివాడికి, ప్రయత్నం చేసి మనస్సును నిగ్రహించుకొన్నవాడికి అటువంటి ఉత్తమోత్తముడికి మాత్రమే బ్రహ్మనిర్వాణం లభిస్తుంది.

మీరు ఎవరికయినా మామిడిపండు యిచ్చారు అనుకోండి. నేను యిచ్చాను, నేను యిచ్చాను అనుకొంటున్నారు కదా, మరి ఆ మామిడిపండుని మీకు ఎవరు ఇచ్చారు. ఈ ప్రపంచంలో ఉన్న సంపద అంతా భగవంతుడిదే. యిది నీది, అది నాది అని వ్యవహారానికి కల్పించుకొంటున్నాము. ఐశ్వర్యం ప్రజలు అనుకొన్నంత చెడ్డదేమీకాదు. సత్పురుషుల చేతిలో ఉంటే అది సద్వినియోగం అవుతుంది, దుర్మార్గుల చేతిలో ఉంటే అది దుర్వినియోగం అవుతుంది. సంపద దానంతట అది చెడ్డది కాదు. ఒకసారి పరమహంస గారు, భక్తులు కలిసి పడవలో నదిని దాటుతున్నారు. పడవలో ఉన్నవాడికి ఆస్థి బాగా కలిసింది. అతడు అంతకుముందు రామకృష్ణపరమహంసగారి దగ్గరకు వస్తూ ఉండేవాడు, అప్పుడు ఏమండీ

పంతులుగారు అని పరమహంసగారిని పలకరించేవాడు. పడవలో నదిని దాటుతూ రామకృష్ణుడితో ఏమయ్యా పంతులు ఎలా ఉన్నావు అన్నాడు. ఆ ప్రక్కనే ఉన్న భక్తులకు కోపం వచ్చి మర్యాదలేకుండా మాట్లాడుతున్నావేమిటి అన్నారు. అప్పుడు పరమహంసగారు మీరు ఏమీ మాట్లాడవద్దు అని భక్తులవంక చెయ్యి ఊపారు. పడవ దిగిపోయాక ఏమిటి మీరు అలా చెయ్యి ఊపారు అని రామకృష్ణుడిని భక్తులు అడిగారు. రామకృష్ణుడు ఏమన్నారు అంటే ఈ మధ్యన వాడికి ఆస్థి బాగా కలిసింది, ఆస్థి వచ్చినప్పటినుండి నోటికి పక్షవాతం వచ్చింది. పక్షవాతం వచ్చినవాడు ఎలా మాట్లాడతాడో ఆస్థులు సడన్‌గా పెరిగినవారికి అటువంటి వంకర మాటలు వస్తాయి. అది వాడు మాట్లాడటంలేదు, వాడి దగ్గర ఉన్న ఆస్తి మాట్లాడుతోంది, అందుచేత మనం ఊరక ఉండటం మంచిది అని చెప్పారు.

ఇంజనీరుగారు ఇంకో ప్రశ్న అడిగారు. రాముడిపాదం నీమీద పడుతుంది అప్పుడు నువ్వు స్త్రీ రూపం ధరిస్తావు అని అహల్యకు గౌతముడు వరం ఇచ్చాడు. గౌతముడు ఇచ్చిన వరం ప్రకారం అహల్య స్త్రీరూపం ధరించిందా లేకపోతే రాముడు పాదం వేయటం వలన ఆ రాయి స్త్రీ రూపం ధరించిందా అని ఆయన ప్రశ్న. ఇవన్నీ పేచీలు. నేను ఏమని సమాధానం చెప్పాను అంటే గౌతముడు భవిష్యత్తు చెప్పాడు అంతే, రాముడు పాదం వేయటం వలననే మరల అహల్య స్త్రీరూపం ధరించింది మరి గౌతముడు చెప్పినమాట నిజమే కదా అంటే జరగబోయేది గౌతముడు చెప్పాడు, ఆ రాయి స్త్రీరూపం ధరించటానికి రాముడి పాదమే కారణం అని చెప్పాను. లోపల ఉన్న బ్రహ్మంకు శరీరం అక్కరలేదు. ఎవరికి కావాలి అంటే మనస్సుకు కావాలి. శరీరంతో నువ్వు తాదాత్మ్యం పొందుతున్నావు కాబట్టి శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అంటున్నావు. నువ్వు శరీరం కాకపోయిన అదే నేను అనుకుంటున్నావు. అందుచేత నేను చనిపోతున్నాను అంటున్నావు. నువ్వు ఎక్కడ చస్తావు. మనోనాశనం అయ్యేవరకు, అమనస్కస్థితి వచ్చేవరకు మీకు శరీరాలు రావటం మానవు. యిదే బుద్ధుడిని అడిగితే ఆయన చాలా అందంగా చెప్పారు. భగవంతుడు ఉన్నాడా? లేడా? ఆ చర్చలోనికి ఆయన వెళ్ళలేదు. నీకు దేహం అవసరం ఉన్నంతకాలం అది వచ్చి తీరుతుంది. నీకు దేహం అవసరం లేదు అనుకొన్నప్పుడు ఇంక శరీరం రాదు. నీకు ఏ దేహం వస్తుంది, నువ్వు ఎక్కడ పుడతావు అనేది ఈశ్వర నిర్ణయం. యదార్థం చెప్పాలంటే ధ్యానం అంటే చేసేది కాదు, వచ్చేది. ముందు మనకు ధ్యాస కుదరాలి. ధ్యాసకుదిరితే

ధ్యానం వస్తుంది. ధ్యానానికి కూర్చొన్నప్పడు కూడా ముందు కొంతసేపు జపం చెయాలి. కొంత టైము జపం చేసిన తరువాత అప్పడు మనస్సు క్వయిట్‌గా ఉంటుంది, అప్పడు ధ్యానం కుదురుతుంది. ధ్యానం అంటే ఏక వస్తువును చింతించటం ఏక వస్తువును చింతించటం వలన కూడా మనస్సు నశిస్తుంది.

**కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్.**

కామక్రోధములు అన్నా రాగద్వేషములు అన్నా ఒక్కటే. కామం అంటే ఇష్టం, క్రోధం అంటే అయిష్టం. ఇవి రెండూ ఉన్నప్పడు మిగాతాపరివారం అంతా వచ్చేస్తుంది. అంటే కోపము, మదము, కోరిక ఇవి అన్నీ వచ్చేస్తాయి. కామక్రోధాలు అనేవి నిజం కాదు, అవి మనస్సులో వచ్చే కెరటాలు. వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. యతీనామ్ యత చేతసామ్ అంటే నీ అధీనంలో మనస్సు ఉండాలి కాని మనస్సు అధీనంలో నువ్వు ఉండకూడదు. మనో నిగ్రహం ముఖ్యం. నీ శరీరం ఎక్కడ ఉందో నీ మనస్సుకూడా అక్కడే ఉండాలి. ఈ లోకాన్ని జయించినవాడికంటే తన మనస్సును జయించిన వాడు గొప్పవాడు. విదితాత్మానామ్ అంటే ఆత్మజ్ఞానం పొందినవాడు అంటే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి రావాలి. రాగద్వేషములనుండి విడుదల పొందినవాడు, ఆత్మతత్వం ఎఱిగినవాడు, మనస్సును యింద్రియములను జయించినవాడు బ్రహ్మనిర్వాణం పొందును. బ్రహ్మం అంటే సత్యం, బ్రహ్మం అంటే జ్ఞానం, బ్రహ్మం అంటే అనంతం, బ్రహ్మం అంటే ఉండటం. బ్రహ్మం ఎలా ఉంటుందో బ్రాహ్మీస్థితిని పొందినవాడికే అది తెలుస్తుంది. బ్రాహ్మీస్థితిని పొందిన వాడిని మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేసినా ఆయన మనకు అర్దం కాడు. రాముడు దేవుడు, కృష్ణుడు భగవంతుడి యొక్క అవతారం అని గుర్తించినవారు చాలా తక్కువ. అంటే దానికి కూడా ఎంతో కొంత పుణ్యబలం ఉండాలి.

మన రాజ్యాంగాన్ని మేధావులు అందరూ కలిసి వ్రాసారు. తరువాత దానికి అనేక సవరణలు చేసారు.మరి భగవద్గీతకు ఒక్క సవరణ చేయగలమా? చేయలేము ఎందుచేతనంటే అది భగవంతుడు చెప్పాడు. ఎంత తెలివైన మనస్సు వ్రాసినా, బుద్ధి వ్రాసినా అవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మన శరీరాలే కాలప్రవాహంలో కొట్టుకొని పోతున్నాయి కదా! నువ్వు ఎన్ని వేల కోట్లు సంపాదించినా ఆ సంపాదించే టైములోనే అది ఎప్పుడు పోవాలో బీజాలు పడిపోతాయి. అలాగని సంపాదించేవాడు అనుకొంటే ఇంక

వాడు సంపాదించలేడు. కాలప్రవాహం గెంటుకొని వెళ్ళలేని వస్తువు అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అని వాల్మీకి చెప్పాడు.

నువ్వు అసలు మనస్సును తప్పించకుండా నీకు జ్ఞానం ఎలా వస్తుంది. బ్రహ్మము, దేవుడు, జ్ఞానము మాట వదిలేయండి. మన మనస్సు మనకు తెలుస్తోంది కదా. కోరికలు అన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి? మనస్సులోనుండే వస్తున్నాయి. ఆ మనస్సును తప్పించకుండా నీకు జ్ఞానం ఎలా వస్తుంది? దానిని తప్పించాలి కదా! ఒక ఉపనిషత్‌లో చెపుతాడు నీ కుటుంబక్షేమంకోసం అవసరమైతే నీ క్షేమాన్ని తగ్గించుకో, గ్రామక్షేమం కోసం నీ కుటుంబక్షేమాన్ని తగ్గించుకో, దేశ క్షేమం కోసం ప్రాంతీయ తత్వం విడిచిపెట్టేయి, ప్రపంచ క్షేమంకోసం ఇది నా దేశం అనే స్వార్థభావనను తగ్గించుకో, ఆత్మజ్ఞానంకోసం అవసరమైతే ఈ ప్రపంచాన్ని వదిలేయి. గౌతమబుద్ధుడు నిర్వాణసుఖం పొందటానికి అన్ని వదిలిపెట్టేసాడు కదా! గౌతమబుద్ధుడు లాంటివాడు నాకు ప్రపంచచరిత్రలో ఎవడూ కనబడలేదు. ఎవరికైనా మామిడిపండు ఇస్తే మనం ఆరునెలలు జ్ఞాపకం పెట్టుకుంటాము. గౌతమబుద్ధుడు మహాసామ్రాజ్యాన్ని వదిలిపెట్టాడు. నేను రాజ్యాన్ని వదిలేసాను అనే తలంపు కూడా ఆయనకు ఎప్పుడూ రాలేదు. అంటే 100% డిటాచ్‌మెంట్, 100% ప్యూరిటీ. నిన్ను నువ్వు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేసుకో. ఎవడో వచ్చి నిన్ను బాగుచేస్తాడని వాళ్ళకోసం కనిపెట్టుకొని ఉండకు.

**విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః**
**నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి**

నేను అనే తలంపు, నాది అనే తలంపు లేనివాడు అంటే అహంకారం, మమకారం లేనివాడు, కోరికలు లేని స్థితిని పొందినవాడు మాత్రమే శాంతిని పొందుతాడు అంటే అట్టి వాడికి మాత్రమే శాంతి స్వరూపంగా వ్యక్తమవుతుంది. నీకు భిన్నంగా ఉన్న దానిని దేనిని ఆశించినా అది కోరికే. కొంతమందికి నిరంతరం వారి యోగక్షేమాలమీదే స్పృహ ఉంటుంది కాని ఆత్మజ్ఞానం మీద స్పృహ ఉండదు. అంటే మనకు లేనిది సంపాదించటం, ఆ వచ్చిన దానిని మరల కాపాడుకోవటం ఇదే గొడవ. సమస్త కోరికలపట్ల నిస్పృహః అంటే ఆశ ఉండకూడదు. నీ రూపంతోగాని, పేరుతోగాని, మనస్సుతోగాని నువ్వు తాదాత్మ్యం పొందితే నీకు అహంకారం ఉన్నట్లే. మనం నేను, నేను అంటున్నాము కదా! అదే అహంకారం. నేను వచ్చాక నాది వస్తుంది. అంటే మమకారం వస్తుంది. నేను అనే తలంపు వచ్చాకే దేహం వచ్చింది, ప్రపంచం వచ్చింది, దేవుడు వచ్చాడు, జన్మలు వచ్చాయి, మొత్తం గొడవ అంతా

వస్తోంది. హు ఈజ్ దిస్ ఐ. ఈ నేను ఎవరు? ఈ నేను నీ లోపలే ఉంది కదా! అది ఎక్కడ నుండి వస్తోంది? ఒకసారి రమణమహర్షిగారితో మీ కుడి చెయ్యి చూపించండి, జాతకం చెపుతాను అన్నాడు. నువ్వు చూసి చెపుతావు అనుకో అది నాకు వర్తించదు అన్నారు. నువ్వు ఎవరికి చెపుతావు దేహానికి చెబుతావు మరి దానికి నాకు సంబంధం లేదు కదా! అందుచేత నువ్వు చెప్పేది నాకు వర్తించదు అన్నారు. దేహేంద్రియముల పట్ల గాని, పేరు ప్రఖ్యాతులపట్లగాని అసలు స్పృహ ఉండకూడదు. నువ్వు గౌరవం వెనకాల పరుగెడుతూ ఉంటే అసలు నీ జీవితంలో నీకు గౌరవం రాదు. ఈ గౌరవాల పట్ల నీకు స్పృహ ఉండకూడదు.

**కర్మ, అకర్మ, వికర్మ**

కర్మ అంటే పని. మనకు శరీరం వచ్చింది, శరీరం వచ్చినందుకు మనం చెయ్యవలసిన పని కర్మ అంటే మన డ్యూటీ మనం చెయ్యాలి. శాస్త్రం విధించిన పనిని చేయటం కర్మ. శరీరంతో నీ మనస్సు బాగుపడే పనులు చేయాలి లేకపోతే ఈ శరీరాన్ని ఏమి చేసుకుంటావు. దేహం నిలబడటం కోసం కాకుండా సమాజ శ్రేయస్సుకోసం మనం చేసే పని కూడా కర్మే. దానివలన నీ మనస్సు పవిత్రం అవుతుంది.

అకర్మ అంటే మామూలుగా పనిచెయ్యకుండా ఉండటం అని అర్థం. అకర్మ అంటే జ్ఞానమే. అకర్మ అంటే చైతన్యమే అకర్మ అంటే బ్రహ్మమే అని ఆచార్యులవారు చెప్పారు. నీ హృదయంలో బ్రహ్మం ఉంది. నువ్వు చేసే మానసికపనికి, శారీరకపనికి సాక్షిగా ఉంటుంది కాని అది ఏమీ చెయ్యదు. నీ శరీర ప్రారబ్ధాన్ని బట్టి అది ప్రేరేపిస్తుంది.

వికర్మ అంటే భగవంతుడు నిషేధించిన కర్మ. భగవంతుడు ఏ పని చెయ్యటం మంచిదికాదు అని చెప్పాడో దానిని వదిలెయ్యాలి. భగవంతుడు వద్దని చెప్పిన పనిని చెయ్యటం వలన నువ్వు అపవిత్రుడవు అవుతావు. కర్మలో అకర్మను చూడు అని పరమాత్మ చెప్పాడు. నువ్వు పని దేనితో చేస్తావు. శరీరంతో చేస్తావు, ఇంద్రియాలతో చేస్తావు, మనస్సుతో చేస్తావు. అక్కడ కర్మలో బ్రహ్మంను చూస్తూ ఉంటే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానం. కర్మలో అకర్మను చూసేవాడు వివేకవంతుడు, బుద్ధిమంతుడు. మనం అందరం అకర్మలో కర్మను చూస్తున్నాము. నేను ఇది చేసాను, నేను అది చేసాను అంటున్నాము కదా! నేను చేస్తున్నాను అంటే అక్కడ నువ్వు ఎవరై ఉన్నావు? నువ్వు బ్రహ్మం అయి ఉన్నావు. బ్రహ్మంలో ఏమి చూస్తున్నావు? కర్మను చూస్తున్నావు. అంటే అకర్మలో కర్మను చూస్తున్నావు.

కర్తృత్వం లేనివాడు కర్మలో అకర్మను చూస్తాడు. కర్తృత్వం ఉన్నవాడు అకర్మలో కర్మను చూస్తాడు అని ఆచార్యులవారు చెప్పారు. మేము చేసే పనులన్నీ మీరు చేస్తున్నారు కదా! ఇంక మీరు చెయ్యనివారితో సమానం ఎలా అవుతారు అని రమణమహర్షిగారిని అడిగారు. నువ్వు దేహం అనుకొంటున్నావు కాబట్టి నన్ను కూడా దేహమాత్రుడిగానే చూస్తున్నావు. దేహం పని చేస్తున్న మాట నిజమే. మరి నేనెవరను? బ్రహ్మంను. బ్రహ్మం పని చేస్తుందా? అదేమీ చేయదు, మనం చేసే పనులకు సాక్షిగా ఉంటుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. ఇక్కడ అడిగేవాడికి నేను అంటే శరీరం, జ్ఞానికి నేను అంటే బ్రహ్మం. రమణమహర్షిగారు అంటే బ్రహ్మం అని వాడికి తెలియదు కాబట్టి ఆయనను శరీరమాత్రుడిగా చూస్తున్నాడు. అందుచేతవాడిలాగే ఆయన కూడా కర్మ చేస్తున్నాడు అనుకొంటున్నాడు. నేను కర్మ చేస్తున్నాను అని భగవాన్ అనుకొంటున్నారా? ఆయన అనుకోవటంలేదు. ఆయన ఏద్దై ఉన్నారు? బ్రహ్మం అయి ఉన్నారు. చూసేవాడు బ్రహ్మంలో కర్మను చూస్తున్నాడు. కాని భగవాన్ ఏమి చేస్తున్నారు కర్మలో అకర్మను చూస్తున్నారు. చూసేవాడు అకర్మలో కర్మను చూస్తున్నాడు అదే టైములో ఆయన కర్మలో అకర్మను చూస్తున్నారు. కర్మలో అకర్మను చూసేవాడు చేసినా చెయ్యనివాడితో సమానము.

ఈ భీష్ముడిని చంపితే పాపం, ద్రోణుడిని చంపితే పాపం, వారిని చంపితే పాపం, వీరిని చంపితే పాపం అని యుద్ధసమయంలో అర్జునుడు కృష్ణుడితో అంటే పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నీకు దేహబుద్ధి లేకుండా ఆత్మబుద్ధితో మూడు లోకాలను దహనం చేసినా నీకు కొంచెంకూడా పాపం అంటదు అని చెప్పాడు. అంటే అర్జునుడు కర్మలో అకర్మను చూడాలి. కర్మలో అకర్మను చూసేవాడు ద్రోణుడిని, భీష్ముడినే కాదు ఈ మూడు లోకాలను దహనం చేసినా వాడికి పాపం అంటదు ఎందుచేతనంటే అక్కడ దేహము నేను అనే తలంపు లేదు.

రామకృష్ణుడు ఏమన్నాడు అంటే మీరు ఎంత? మీ తెలివితేటలు ఏపాటివి? మీ మనస్సు ఏపాటిది? మీ బుద్ధి ఏపాటిది? వీటితో మీరు భగవంతుడిని తెలుసుకోగలరా? మీ తెలివితేటలతో భగవంతుడిని కొలవగలరా? మీ మనస్సుతో ఎంతవరకు ధ్యానం చెయ్యగలరు? మీ బుద్ధితో ఎంతవరకు విచారణ చెయ్యగలరు? ఆయన దయ ఉండాలి. భగవంతుడి దయ ఎలా వస్తుంది అంటే దైనందినజీవితంలో మీ ప్రవర్తన వల్ల ఆయన అనుగ్రహం పొందాలి. భగవంతుడి అనుగ్రహం లేకుండా ఆయన స్వరూపాన్ని మీరు పొందలేరు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగష్టు | 18 | ఉద్రాజవరం వృద్ధుల ఆశ్రమం (వయా తణుకు) |
| ఆగష్టు | 28 | జిన్నూరు శ్రీరమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# అభేదత్వం

పరమాత్మ అనగానే మనకు బాహ్యంగా, అతీతంగా ఉన్న శక్తిగా భావిస్తాం, దానికి కారణం భేదబుద్ధి. భగవాన్ శ్రీరమణమహర్షి జగజ్జీవేశ్వరులు ఒకే చైతన్యంలో కల్పితం అంటారు. మనను దివ్యత్వం నుండి తలంపు రూపంలో వేరుచేసేది మనస్సే! అదే అహంకారం! మనలో అంతర్యామిగా, సాక్షిగా ఉన్నది పరమాత్మ కాబట్టి త్రికరణ శుద్ధి అవసరం. అనగా తలంపు, మాట, చేత ఒకేవిధంగా ఉండాలి. సర్వజ్ఞుడైన పరమాత్మ సాక్షాత్తు మన మూల తలంపు యొక్క మూలంలోనే ఉన్నాడు, అదే హృదయం. 'నేను' అంటే దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన చైతన్యమే! మనలో అంతర్యామిగా, స్వరూపంగా పరమాత్మ ఉన్నప్పటికీ, మనకు జీవలక్షణాలు ఉన్నంత కాలం, మనము కర్తృత్వం పెట్టుకున్నంతకాలం, పరమాత్మ వ్యక్తం అవ్వడు. పరమాత్మ స్వరూపంగా ఉన్నా, ఆయనను దర్శించే చూపు మనకు లేదు. సూర్యుడు ప్రత్యక్షంగా ప్రకాశిస్తూ ఉన్నా, ఆయనను దర్శించాలంటే మన చూపును ఆయనవైపుకు మళ్ళించాలి. సూర్యుడు నన్ను చూస్తున్నా, నేను ఆయనను చూడకపోతే ప్రయోజనం ఉండదు. మన చింతన ప్రాపంచిక విషయాల మీద ఉందా? పరమాత్మ మీద ఉందా? పరిశీలించుకోవాలి. మంచిమాటలు ఏనోటి ద్వారా వచ్చినా స్వీకరించాలి. మనస్సు ఎలాగైతే సంసారానికి ద్వారమో, నేనెవరు? అను విచారణ మోక్షానికి ద్వారం. స్వరూపశాంతితో నిరంతర అనుసంధానం వల్ల భ్రాంతికి, దుఃఖానికి దూరం అవుతాము. హృదయంలో ఉన్న సత్యం అద్వైతస్థితి, అది మాటలకు మనస్సుకు అందదు, అనుభవానికి అందుతుంది. సకల చరాచర సృష్టి పరమాత్మలోనే ఉంది. ఆయనకన్న భిన్నముగా ఒక్క అణువు కూడా లేదు. దేహము యొక్క మరణానికి ముందే జననమరణాల కతీతమైన స్వరూప అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవాలి. దానికి అనుగుణంగా జీవించాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# కర్మగతి - మార్చరానిది

కర్తయొక్క ఆజ్ఞననుసరించే కర్మ ఫలిస్తుంది. ఈ ప్రకృతి మాయలో చిక్కుకొన్న మనకు స్వతంత్ర సంకల్పబలంతో కర్మగతిని అతిక్రమించే స్వేచ్ఛ ఉందంటే అర్థరహితము. వశిష్టముని వంటి పండితుడు శోధించి శుభలగ్నము పెట్టినా సీత అపహరించబడి అడవిపాలై ఆపదల పాలైనది. హరిశ్చంద్రుడు నీచుని చేతిలో అమ్ముడైనాడు. శుక్రాచార్యులు ఎంత ప్రయత్నించినా బలిచక్రవర్తి పాతాళానికి పోయాడు. కృష్ణపరమాత్మను సారథిగా పెట్టుకొన్న పాండవులు అనేక ఆపదల పాలైనారు. కోటియుగాలు గడిచినా కర్మలిఖితం మాసిపోదు, చెరిగిపోదు. ఎన్నోజన్మలనుంచి వంకరటింకర నడకలతో కాలం గడిపాము. ఫలితం అనుభవానికి సమయం పడుతుంది. నవ్వుతూ చేసే హింసాకార్యం ఏడుస్తూ అనుభవించే రోజు వస్తుంది. రాగద్వేషాలు, మంచిచెడులు, ద్వంద్వాలు, బంధాలు వాటిని విత్తినవాడికి ఆ పంట దొరకటం తథ్యం. కారణం కార్యమవ్వటం అనివార్యం. మన సొత్తు కానిది ఏదీ మనకు లభించదు. ఇది పరమసత్యం. మనం ఒక చెడ్డపనిని తెలుసుండే చేస్తూంటాము. ఆపనిని తెలివితోనే చేస్తూంటాము. దానికి కారణం మాత్రము చిత్తంలో ఎక్కడో ఏ రూపంలోనో మనకు తెలియకుండా పడిపోతుంది. దాని ఫలితానికి చాలా శక్తి ఉంటుంది. రామకృష్ణ పరమహంస గారితో ఒకడు 'అయ్యా! గంగానదిలో స్నానం చేసి నేను చేసుకున్న పాపాలు పోగొట్టుకుందామని వచ్చాను' అనగా 'ఓరి పిచ్చివాడా! నీవు గంగలో స్నానం చేసే సమయంలో నీ పాపాలన్నీ దాని ఒడ్డున ఉన్న చెట్లమీద కూర్చొని నీ రాకకోసం చూస్తూ 'వచ్చావా నా బిడ్డా! ఇప్పుడు నీ మీద ఎక్కుతామని మరలా నీమీద వాలిపోతాయి. ఆ చెట్లు అందుకే అక్కడ ఉన్నాయి' అన్నారు. ఇటువంటి పనులతో ప్రారబ్ధం తొలగించుకొందామనే ఆలోచనా సరళి అపసవ్యమైనది. శ్రీనాన్నగారు 'ఒకచోట తీసిన సినిమారీలు ఎక్కడ ప్రదర్శించినా ఒకరకంగానే ఉంటుంది. ఈ జన్మలో నీవు ఏమి అనుభవించాలో తల్లిగర్భంలో ఉండగానే నిర్ణయమైనది' అన్నారు. పాపపంకిలమైన వ్యక్తి భగవంతుని సభలో స్థానంలేదు. ఇనుమును మరలా మరలా కరిగించి మూసలోపోసినట్లే దుర్మార్గుడు శరీరం చనిపోయిన తరువాత ఏ మానసికస్థితిలో ఉంటుందో అదేస్థాయిలో మరుజన్మలో మరలమరల జీవిస్తూఉంటాడు. అండర్‌సన్ 'ప్రతీ మానవజీవితం భగవంతుని స్వహస్తాలతో వ్రాసిన అద్భుతగాథ' అన్నారు. స్వామి వివేకానంద 'ప్రతీరోజూ నా జీవితాన్ని మలచేది నేనే. మంచికి మంచి, చెడుకు చెడు ప్రతీపనికి ఫలితం తథ్యం. ఎవరిని దూషించగలను తప్పనాదే. మూర్తీభవించిన నా గతాన్ని నేనే నా గతంలో నా ఆలోచనే, ఈనాటి తలరాతను ఏమనగలను. భయాన్ని పనికిరాని పశ్చాత్తాపాన్ని పరిత్యజించి కర్మఫలాన్ని సవాలుగా తీసుకొంటాను' అన్నారు. కీడు లేనిదే మేలు ఎన్నడూ జరగదు అలాగే మేలు లేనిదే కీడు ఎన్నడూ సంభవించదు. మన రాగ, ద్వేషాలే కాలాంతరమున మనమీదకు వస్తుంది. ఆపనికి మనమే మన చేజేతులా బలమిచ్చాము కాబట్టి మనం బ్రతకదలచినచో కాలగతికి అనుగుణంగా మార్పు చెందుతూ ఉండాలి. అదే ధీశక్తి. గురుప్రేమలో తేలిపోతూ ఉంటే కర్మగతి, అతిగతీ లేకుండా కొట్టుకుపోతుంది. ఇది సత్యసమ్మతమైన పంథా. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**